క్లుప్తంగా

సూర్యఘర్‌పై సమావేశం నేడు

పొదలకూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు పీఎం సూర్యఘర్‌పై సమావేశం నిర్వహిస్తామని పొదలకూరు విద్యుత్ డీఈ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

మట్టి ప్రమిదల విక్రయాలు



ప్రమిదల విక్రయం

పొదలకూరు: మహిళలు మట్టి ప్రమిదలపై మక్కువ చూపుతున్నారు. కార్తీక మాసం నేపథ్యంలో అనేకమంది గృహాల్లో ప్రమిదలను వెలిగిస్తారు. అంతేకాక ఆయా ప్రాంతాల్లో శైవ క్షేత్రాలకు వెళ్లి దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. దీంతో మట్టి ప్రమిదలు బాగా అమ్ముడుపోతున్నట్టు పోలీస్‌స్టేషన్ ఎదురుగా అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులు వెల్లడించారు.

నారుమళ్లకు నీటి విడుదల



నీటి విడుదలకు ముందు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : కనిగిరి రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, విడవలూరు, కొడవలూరు, అల్లూరు మండలాల నారుమళ్లకు సాగునీటిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం విడుదల చేశారు. సదరన్ చానల్ నుంచి వంద క్యూసెక్కులు, ఈస్ట్రన్ చానల్ నుంచి 80 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేశారు. తొలుత గంగమ్మకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చీర, సారెను సమర్పించారు. నాట్లు వేసే సమయానికి అన్ని కాలువల పూడికతీత పనులు పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుప్రజ, గోవర్ధన్ రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, శేషయ్య, హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు విద్యార్థుల పాట్లు

దుత్తలూరు: మండలంలో 11 సచివాలయాలున్నా ఆధార్ అప్‌డేట్ కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించి అపార్ నమోదు చేపడుతోంది. అందుకు సంబంధించి విద్యార్థుల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుల్లోని వివరాలకు ఎలాంటి తేడాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. దుత్తలూరు, నందిపాడు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినా పరికరాలు పనిచేయక సేవలందడం లేదు. దీంతో విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ కోసం సుదూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలాధికారులు వెంటనే స్పందించి ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

జొన్నవాడలో నిలువుదోపిడీ



జొన్నవాడలోని ప్రసిద్ధ కామాక్షితాయి ఆలయం



వెహికల్ నంబర్, పంచాయతీ ముద్ర లేకుండా ఇచ్చిన రసీదులు

- పంచాయతీ టోల్ అంటూ అడ్డగోలు వసూళ్లు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయం ఒకటి. ఆలయానికి ఇతర జిల్లాల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి అమ్మవారి దర్శనం కోసం జొన్నవాడకు వస్తుంటారు. వివిధ రకాల వాహనాల ద్వారా గ్రామానికి చేరుకునే సమయంలో ఆలయం వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ టోల్‌గేట్ నిర్వాహకులు వాహనదారుల నుంచి నిర్ణీత రుసుము కన్నా అదనంగా వసూలు చేస్తున్నారు. ఆటోలకు రూ.10, కార్లకు రూ.20, బస్సు, లారీలకు రూ.50 వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే దీనికి అదనంగా కార్లలో వచ్చేవారి నుంచి నిర్ణీత రుసుము కన్నా రూ.30, ఆటోలకు రూ.15, బస్సులు, లారీలకు రూ.50లు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రశ్నిస్తే దుర్భాషలాడుతూ, దౌర్జన్యం చేస్తున్నారు. దీంతో భక్తులు చేసేదేమీ లేక వారు అడిగినంత చెల్లించి ఆలయానికి వెళ్తున్నారు.

మేము టీడీపీ వాళ్లం.. ఏమీ చేయలేరు

తాము టీడీపీకి చెందినవారమని, తమను ఎవరూ ఏమీ చేయలేరని నిర్వాహకులు స్థానికులు, భక్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఎవరికి ఫిర్యాదు చేసినా ఏం ఉపయోగం ఉండదని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇలాగే ఆలయం ముందు టోల్‌గేట్‌ను ఏర్పాటు చేశారు. అయితే అప్పుడు టోల్‌గేటు తొలగించాలని భక్తుల నుంచి వినతులు అందడంతో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దీనిని నిలుపుదల చేయించారు. ప్రస్తుతం కోవూరు ఎమ్మెల్యేగా ఉన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అడ్డగోలుగా టోల్ వసూలు చేస్తున్నా.. ఎలాంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. దీనిపై విచారణ చేయించి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన టోల్‌గేటును తొలగించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

సెలవులో ఉన్నా

గ్రామంలో ఏర్పాటు చేసిన టోల్‌గేటు వద్ద అధికంగా నగదు వసూళ్ల విషయం తన దృష్టికి వచ్చింది. అనారోగ్యం కారణంగా తాను సెలవులో ఉన్నా. సెలవు నుంచి రాగానే ఈ విషయమై విచారణ జరిపించి ఉన్నతాధికారుల సూచనల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– కావేరి, జొన్నవాడ పంచాయతీ కార్యదర్శి

మా పరిధిలో ఉండదు

ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన టోల్‌గేటు విషయం తమ పరిధిలో లేదు. గ్రామ పంచాయతీ అధికారులు టోల్‌గేటును ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఆలయం తరఫున తాము చేయడానికి కూడా ఏమీ లేదు.

– అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, కామాక్షితాయి ఆలయ ఈఓ, జొన్నవాడ

వాహనదారులకు నకిలీ రసీదులు

వాహనదారులు తమ వాహనాలకు చెల్లించిన రుసుములకు సంబంధించి సరైన రసీదులను నిర్వాహకులు అందించడంలేదు. నకిలీ రసీదులు అందిస్తున్నారు. రసీదుపై గ్రామ పంచాయతీకి సంబంధించిన స్టాంప్ ఉండాలి. వెహికల్ నంబర్ రాయాలి. కాంట్రాక్టర్ పేరు, ఫోన్ నంబర్ ఉండాలి. కానీ అలాంటివేవీ ఇక్కడ జరగవు. టోల్ నిర్వాహకులు డిమాండ్ చేసిన నగదు చెల్లిస్తే వారిచ్చిన నకిలీ రసీదు తీసుకుని కిమ్మనకుండా అక్కడి నుంచి వెళ్లిపోవాలి.

పసుపు కొమ్ముతో శివలింగం



కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము ఆదివారం పసుపు కొమ్ముతో సూక్ష్మ శివలింగాన్ని తయారు చేశాడు.

– మనుబోలు

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



మనుబోలు: మండలంలోని మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్రశర్మ అమ్మవార్లకు పంచామృతాభిషేకం చేశారు. ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జక్కా వెంకయ్యకు ఘన నివాళి

తోటపల్లిగూడూరు: మండంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో ఆదివారం ప్రముఖ కమ్యూనిస్ట్ నేత జక్కా వెంకయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ వెంకయ్య భూస్వామ్య కుటుంబంలో జన్మించినా ఆ విధానాలపై తిరుగుబాటు చేసి పేదలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి అన్నారు. తుదిశ్వాస వరకు నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. నేటితరం ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, మండల కమిటీ సభ్యులు బండి శౌరి, పచ్చా మధు, మారుబొయిన రాజా, మోచర్ల రాధయ్య, ఇనమాల కొండయ్య, వేగూరు వెంకయ్య, కాల్తిరెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నేతలు

కౌండిన్య మహర్షి జయంతిని జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేసిన నాయకులు

- జై గౌడ ఉద్యమం రాష్ట్రాధ్యక్షుడు కిశోర్ గౌడ్

తోటపల్లిగూడూరు: గౌడ వంశ మూలపురుషుడు కౌండిన్య మహర్షి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని జై గౌడ ఉద్యమం రాష్ట్రాధ్యక్షుడు చిట్టిబొమ్మ కిశోర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం తోటపల్లిగూడూరులో గౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షుడు మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్ ఆధ్వర్యంలో ఆ కులస్తుల సంఘీభావ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కిశోర్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన తెనాలిలో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ముగింపు కార్యక్రమం 15వ తేదీన హైదరాబాద్‌లో జరుగుతుందన్నారు. ఆ రోజున గౌడ కులస్తుల వనభోజనాలు నిర్వహిస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి గౌడ నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం జిల్లా అధికార ప్రతినిధి అన్నాబత్తిన కృష్ణ, నాయకులు మన్నెం చిరంజీవులగౌడ్, ఉప్పల కిశోర్ గౌడ్, వేణుగోపాల్ గౌడ్, రమేష్ గౌడ్, సురేష్ గౌడ్, కిశోర్ గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

వెంకటాచలం: మండలంలోని కసుమూరు సమీపంలో కోడిపందేల స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. వివరాలు.. గ్రామ సమీపంలోని పొలాల వద్ద కోడిపందేలు జరుగుతున్నాయని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వెళ్లి దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం: మండలంలోని పాలిచెర్లపాడు గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై బాధిత తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని వివరాలు.. ఓ మహిళ తన 15 ఏళ్ల కుమార్తెతో కలిసి శనివారం స్థానికంగా ఉన్న చర్చికి వెళ్లింది. తిరిగి ఇంటికి చేరే క్రమంలో కూతురు కనిపించకుండా పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన శ్రీహరి అనే వ్యక్తి తన కుమార్తెను తీసుకెళ్లి ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

అల్లూరు: మండలంలోని చెర్లోసంఘం గ్రామానికి చెందిన చిరంశెట్టి సంజీవయ్య(75), బత్రకాగోళ్లు గ్రామానికి చెందిన యద్దల శేఖర్(36) ఆదివారం మరణించారు. వారి అంత్యక్రియలకు కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేయడంతో పాటు అంతిమ యాత్ర వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీతారామపురం: మండలంలోని నారాయణప్పపేట సమీపంలోని మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. వివరాలు.. వైఎస్సార్ జిల్లా మున్నెల్లి గ్రామానికి చెందిన నారాయణ, పోలమ్మ, నాగమణి ప్రకాశం జిల్లా సీఎస్పురం మండలంలోని నారాయణస్వామి ఆలయానికి మోటార్‌బైక్‌పై బయలుదేరారు. నారాయణప్పపేట సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగానే మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహన సిబ్బంది పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించారు.

వెంకయ్యస్వామి సేవలో మాజీ మంత్రి

వెంకటాచలం: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం మండలంలోని గొలగమూడి భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమాన్ని సందర్శించారు. ఆయనకు ఆశ్రమ కార్యనిర్వహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాకాణి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, నాయకులు విజయభాస్కర్‌నాయుడు తదితరులున్నారు.



వెంకయ్య స్వామిని దర్శించుకున్న కాకాణి

సాగునీటి కోసం ఎదురుచూపులు



వల్లూరు చెరువు గుర్రపుడెక్క

ముత్తుకూరు: రబీ సీజన్ ముంచుకొచ్చినప్పటికీ సాగునీరు విడుదల కాక మండలంలోని చెరువులు వెలవెల పోతున్నాయి. సర్వేపల్లి కాలువ నుంచి, వల్లూరు కాలువ, కృష్ణపట్నం కాలువల ద్వారా చెరువులకు ఇంకా సాగునీరు చేరలేదు. కాలువల రిపేర్ల పేరుతో కాలయాపన చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల కురిసిన వర్షాలకు చేరిన కొద్దిపాటి నీరు తప్ప సోమశిల జలాలు అందనేలేదు. మండలంలో సాధారణంగా రబీ సీజన్‌లో 9,500 ఎకరాల్లో వరిసాగు చేస్తారు. ఇప్పటికే రైతులు నార్లు పోసుకోవాల్సి ఉంది. అయితే సాగునీటి కొరతతో దుక్కుల ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. ముఖ్యంగా వల్లూరు, మల్లూరు, పిడతాపోలూరు, నేలటూరు, కొత్తపాళెం, ముత్తుకూరు, నారికేళపల్లి, మామిడిపూడి, పంటపాళెం చెరువులకు సాగునీరందని పరిస్థితి ఉంది. ఇంకా ప్రభుత్వం విడుదల చేసిన వరి విత్తనాలపై కేవలం రూ.5లు మాత్రమే సబ్సిడీ ఇవ్వడం రైతుల్ని తీవ్ర నిరాశ పరిచింది.



మల్లూరు చెరువు ఇలా..


కాలయాపన చేస్తున్నారు



రబీ సీజన్ దరిచేరినప్పటికీ ఇరిగేషన్ ఇంజినీర్లు సాగునీటి విడుదలలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. కాలువల రిపేర్లు ఇప్పటికే పూర్తి చేయాల్సింది. ప్రస్తుతం మరమ్మతుల పేరుతో నీరు విడుదల చేయడం లేదు. వల్లూరు కాలువలోని సాగునీరు బ్రహ్మదేవి లాక్‌ల వద్ద నిలిపివేశారు. రైతులందరూ ఒకేసారి వ్యవసాయ పనులు చేపడితే తీవ్ర స్థాయిలో కూలీల కొరత ఏర్పడుతుంది.

– దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్, పెన్నా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ

అలనాటి జ్ఞాపకాలు కనుమరుగు







- సెల్‌ఫోన్‌లో ఇమిడిపోయిన అనేక సాధనాలు

కోవూరు : గతంలో పండగలు, శుభకార్యాల్లో ఇంటింటా టేప్‌రికార్డులు మోగేది. టెలీఫోన్ బిజీబిజీగా ఉండేది. పండగకు పది రోజుల ముందే ఉత్తరాలు రాసుకునేవారు. సాయంత్రమైతే రేడియో వార్తలు, పాటలు వినిపించేవి. అయితే ప్రస్తుతం ఇలాంటి సాధనాలు సెల్‌ఫోన్‌లో ఇమిడిపోయాయి. ప్రస్తుతం ఎవరి ఇంట్లోనూ ఈ వస్తువులు మచ్చుకైనా కనిపించడం లేదు. కొన్ని ఇళ్లలో ఇవి కబోర్డులో బొమ్మలుగా మిగిలిపోయాయి. ఇలా గడియారం, రేడియో, టేపు రికార్డు, కెమెరా, టెలీఫోన్, చార్చ్‌లైట్ వంటి వాటికి ప్రత్యామ్నాయంగా సెల్‌ఫోన్ మారింది. గతంలో ఈ వస్తువులకు ఎంతో క్రేజ్ ఉండేది.

కనిపించని ఉత్తరాలు

ఒకప్పుడు గ్రామాల్లోకి పోస్టుమ్యాన్ వస్తే ఆయన చుట్టూ జనాలు గుమికూడేవారు. పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు.. వసతిగృహంలో చదువుకునే విద్యార్థుల నుంచి ఉత్తరాలు వచ్చాయా.. అంటూ అడిగేవారు. కొంత కాలానికి ఈ-మెయిల్ రావడంతో ఉత్తరాలు రాసేవారు తగ్గిపోయారు. అనంతరం మొబైల్ ఫోన్ల ద్వారా సందేశాలు పంపేవారు. ఇప్పుడు ఈ-మెయిల్ వాడకం కూడా తగ్గిపోయింది.

సామాన్యులకు అందుబాటులో..

అప్పట్లో టెలిఫోన్ ప్రభుత్వ కార్యాలయాలు, ధనవంతుల ఇళ్లల్లో తప్పితే ఎక్కడా కనిపించేవి కావు. తరువాత ఇవి సామాన్యులకు కూడా అందుబాటులో వచ్చాయి. కాయిన్ బాక్సుల రాకతో టెలీఫోన్‌కు మొదటి దెబ్బ పడింది. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో, కొన్ని ప్రాంతాల్లో తప్పితే టెలిఫోన్ ఎక్కడా కనిపించడం లేదు.

రేడియో, టేపురికార్డులు మాయం

అప్పట్లో రేడియో చాలా తక్కువ నివాసాల్లో ఉండేవి. పాటలు వచ్చే సమయానికి అందరూ ఒకచోట చేరేవారు. తరువాత కొన్ని రోజులకు టేపురికార్డులు, వాక్‌మన్‌లు వచ్చాయి. దీంతో రేడియోల వినియోగం తగ్గింది. తరువాత సెల్‌ఫోన్ రాకతో రేడియో, టేపురికార్డులు కనుమరుగైంది.

సెల్‌ఫోన్‌లోనే వెలుగు

ఒకప్పుడు ప్రతి ఇంట్లో టార్చిలైట్ ఉండేవి. ముఖ్యంగా గ్రామాల్లో టార్చిలైట్ ఉండి తీరాల్సిందే. రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లే రైతులు టార్చిలైట్ వెలుగులో వెళ్లేవారు. ఇప్పుడు సెల్‌ఫోన్‌లోనే ఫ్లాష్‌లైట్ కూడా ఉండడంతో టార్చిలైట్ కనుమరుగైంది.



ప్రత్యామ్నాయ పంటల సాగు మేలు



ఎ.వాసు, ఏఓ

పొదలకూరు: వర్షపాతం నమోదయ్యేంత వరకు రైతులు అప్పటికప్పుడు వరిసాగు చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ వర్షాధార పంటల సాగును చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయాధికారి ఎ.వాసు సూచించారు. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. నువ్వు, పచ్చిశనగ పంటల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. సోమశిలలో తగినంత నీటి నిల్వ ఉన్నందున రబీలో ఆశించిన స్థాయిలో వరినాట్లు పడే అవకాశం ఉందన్నారు. అయితే డిసెంబర్ చివరి వారం వరకు నువ్వు, పచ్చిశనగ విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. నువ్వు పంటను డిసెంబర్‌లో సాగు చేస్తే మంచి ఫలసాయం ఉంటుందన్నారు.

మెట్ట పొలాల సాగు

మెట్ట పొలాల్లో నవంబర్ నుంచి డిసెంబర్ వరకు నువ్వు, ఉలవ, పచ్చిశనగ పంటల సాగు చేసుకునేందుకు అవకాశం ఉందని ఏఓ తెలిపారు. మినుము, పెసర పంటలకు అదును దాటిపోయిందన్నారు. ఈనెలాఖరు వరకు పచ్చిశనగ విత్తుకునేందుకు అవకాశం ఉందన్నారు.



పచ్చిశనగ పంట (ఫైల్)

తక్షణం చేయాల్సి పనులు

వర్షం కురిస్తే రైతులు వెంటనే దుక్కి దున్నకం పనులు చేపట్టాల్సిందిగా సూచించారు. తర్వాత కురిసే వర్షాలకు పైన సూచించిన పంటలను సాగు చేస్తే వరికి ప్రత్యామ్నాంగా రైతులు ఫలసాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 15 నుంచి డిసెంబర్ 31వతేదీ వరకు మెట్టపంటల సాగులో భాగంగా విత్తనాలు విత్తుకోవచ్చునని చెప్పారు. ఆ తర్వాత వర్షం కురిస్తే పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడి సాధించేందుకు వీలు కలుగుతుందన్నారు.